సాక్షి అనంతపురం

సోమవారం । 1 । మే । 2023



ఎస్కేయూకు ఇస్రో దన్ను
వాతావరణంలో కాలుష్యం పెరగడానికి దోహదపడే అంశాలపై ఎస్కేయూ వేదికగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. 8లో



టమాట కిలో రూ.7
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4.50 పలికింది. 10 టన్నుల టమాటాలు అమ్మకానికి వచ్చాయి.



జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

తాత్కాలిక రథంతో బ్రహ్మోత్సవాలు

- అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు వెల్లడి



చక్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

ఉరవకొండ: తాత్కాలిక రథం తెప్పించి పెన్న హోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. 400 ఏళ్ల నాటి రథానికి శనివారం చక్రాలు మార్చే క్రమంలో ఒరిగి కుప్పకూలిపోయింది. దెబ్బతిన్న రథాన్ని ఆదివారం స్థానిక దేవదాయ అధికారులతో కలసి అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పదో తేదీన బ్రహ్మ రథోత్సవానికి తాత్కాలికంగా మరో రథాన్ని తెప్పిస్తున్నామన్నారు. కొత్త రథం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపుతామన్నారు. నూతన రథం కోసం భక్తులు ఇచ్చిన రూ.74 లక్షల విరాళాలు సిద్ధంగా ఉన్నాయని, ఎవ్వరూ ఆందోళనకు గురికానవసరం లేదని తెలిపారు. భక్తులు యథావిధిగా పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత బియ్యం

- రెండో వారంలో జొన్నలు, రాగుల పంపిణీ



అనంతపురం అర్బన్: జిల్లాలో మే నెలకు సంబంధించి కార్డుదారులకు సోమవారం నుంచి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యం ప్రతి సభ్యునికీ ఐదు కిలోల చొప్పున, అంత్యోదయ (ఏఏవై) కార్డుదారుకు 35 కిలోల చొప్పున ఉచితంగా ఇస్తారన్నారు. చక్కెర ఏఏవై కార్డుదారులకు కిలో రూ.13.50తో ఇస్తారని, మిగిలిన కార్డుదారులకు అరకిలో రూ.17తో, ఇక కందిపప్పు కిలో రూ.67 చొప్పున ఇస్తారని వివరించారు. ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తారని తెలిపారు. నిత్యావసర సరుకులు సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను ఆదేశించామన్నారు.

జొన్నలు, రాగులు పంపిణీ..
పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు మే రెండో వారం నుంచి జొన్నలు, రాగుల పంపిణీ ప్రక్రియ ఉంటుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. బియ్యం కార్డుకు వచ్చే కోటా బియ్యంలో ఒక కిలో బియ్యానికి బదులుగా ఒక కిలో రాగులు (గరిష్టంగా 3 కిలోలు) పొందవచ్చన్నారు. గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో కార్డుదారులు బియ్యం కోటాలో ఒక కిలో బియ్యానికి బదులుగా ఒక కిలో జొన్నలు పొందవచ్చన్నారు.

వంచించి.. డ్రామాలు!

నాడు..

పచ్చని పొలాలను జేసీబీలతో ధ్వంసం చేశారు. అడ్డుకున్న రైతులను ఈడ్చుకెళ్లి మరీ అరెస్టులు చేశారు. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి అయితే రైతులను చెప్పుతో కొట్టండి.. ఈడ్చుకెళ్లండి అంటూ మీడియా ప్రతినిధుల ముందే బెదిరించారు. కోర్టులో స్టేటస్ కో ఉన్నా లెక్క చేయలేదు. పైపెచ్చు అరకొర పరిహారం కోర్టులో డిపాజిట్ చేయించి వచ్చే ప్రభుత్వం సైతం బాధిత రైతులకు పరిహారం పెంచే వీలు లేకుండా చేశారు. ఈ విషయం మొత్తం జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారు.

నేడు..

బాధిత రైతుల కోసం ఇటీవల ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 8 ఎకరాలు ప్రత్యేకంగా రోడ్డువైపు కేటాయించారు. ఒక్కో బాధిత రైతుకు 5 సెంట్ల స్థలం ఇస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు ఇచ్చే స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో ఒక్కో సెంటు రూ.4 లక్షల చొప్పున పలుకుతుండగా.. ఈ లెక్కన ఒక్కొక్కరికి రూ.20 లక్షల దాకా లబ్ధి చేకూరుతుండటంతో చాలా మంది అంగీకరించారు. 38 మంది దాకా కోర్టులో కేసులు ఉపసంహరించుకుని ప్లాట్లు తీసుకున్నారు.





టీడీపీ హయాంలో జేసీబీలతో పంట పొలాలన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్), అప్పట్లో భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మహిళా రైతులు (ఫైల్)

టీడీపీ డర్టీ పాలిటిక్స్

- అప్పట్లో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ
- చెప్పుతో కొట్టండి, ఈడ్చుకెళ్లండి అంటూ అన్నదాతలకు సూరి బెదిరింపు
- బాధితులకు ఆది నుంచి అండగా నిలిచిన కేతిరెడ్డి
- నేడు జగనన్న కాలనీలో 5 సెంట్ల కేటాయింపు
- ఆపన్నహస్తాన్ని ఓర్వలేక రోడ్డుపై నిరసన అంటూ డ్రామాలు

ధర్మవరం: ధర్మవరం మండలంలోని తుంపర్తి, పోతులనాగేపల్లి పొలాల పరిధిలో 90 మంది రైతుల నుంచి 210 ఎకరాలను సేకరించాలని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. భూసేకరణ చేయకూడదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదిలా ఉండగానే అప్పటి టీడీపీ ఎమ్మెల్యే వరదాపురం సూరి పచ్చని పంట పొలాలను పోలీసుల పహారాలో జేసీబీలతో ధ్వంసం చేయించారు. అరకొరగా పరిహారం కింద రూ.5 లక్షలు కోర్టులో డిపాజిట్ చేయించి బాధిత రైతులకు వచ్చే ప్రభుత్వం సైతం పరిహారం పెంచడానికి వీలు లేకుండా పన్నాగం పన్నారు.

ఆది నుంచి అండగా కేతిరెడ్డి..
రైతుల నిరసనలకు మద్దతు ఇచ్చి అప్పట్లో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారికి అండగా నిలిచారు. పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికీ స్పందన రాకపోవడంతో భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే తన వంతు సాయం అందిస్తానని భరోసానిచ్చారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల ఖాతాల్లో వేయాల్సిన పరిహారాన్ని టీడీపీ ప్రభుత్వం కోర్టులో డిపాజిట్ చేయడంతో ఇక పెంచే వీలులేదని తెలిసింది. దీంతో ప్రత్యామ్నాయం ఆలోచించి జగనన్న కాలనీలో ఒక్కో రైతుకు 5 సెంట్లు స్థలం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇలా అడుగడుగునా రైతులకు ప్రభుత్వం అండగా ఉండడం చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు మళ్లీ కుట్రలకు తెరలేపారు. అయితే, నిజమైన బాధిత రైతులు బయటకు రావడంతో వారి డ్రామా బట్టబయలైంది.

పాసుపుస్తకానికి 3 ప్లాట్లు



గతంలో ప్రభుత్వ హయాంలో పరిహారం కోర్టులో జమ చేయడంతో ఇప్పుడు పెంచడం సాధ్యం కాదు. ప్రత్యామ్నాయంగా ధర్మవరం-పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఒక్కో రైతు పాసుపుస్తకానికి 3 ప్లాట్లు చొప్పున ఇస్తాం. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – తిప్పేనాయక్, ఆర్డీఓ, ధర్మవరం.

పద్ధతి మార్చుకోవాలి..



4 ఏళ్లుగా కోర్టులో పరిహారం పెంచాలని పోరాటం చేశాం. పరిహారం పెంచేందుకు వీలు లేకుండా చేయడంతో ప్రత్యామ్నాయంగా ఎంతో గొప్పగా ఆలోచించి ఇంటి స్థలాలు ఇస్తుంటే మళ్లీ రాజకీయాలు చేయడం బాధ కల్గిస్తోంది. టీడీపీ నాయకులు పద్ధతి మార్చుకోవాలి.
– నర్సింహులు, బాధితరైతు, మోటుమర్ల, ధర్మవరం మండలం

అరాచక కాండ కళ్లముందే ఉంది



టీడీపీ ప్రభుత్వం గతంలో చేసిన అరాచకం ఇంకా కళ్లముందే ఉంది. అన్యాయాన్ని ఎండగడుతూ మాకు కేతిరెడ్డి చేసిన సాయం మరువలేము. ప్రభుత్వం తరఫున 5 సెంట్ల స్థలం ఇస్తామంటే సంతోషంగా తీసుకున్నాం. మాకు పరిహారం ఇవ్వకుండా చేసిన టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.
– ఎరికల రామయ్య, బాధిత రైతు, ధర్మవరం

దుష్ప్రచారం బాధ కల్గించింది..



నా రెండెకరాలను బలవంతంగా లాక్కున్నారు. పోలీసులతో బెదిరించి అరెస్ట్ చేయించారు. అప్పట్లో కేతిరెడ్డి అండగా నిలిచి సాయం అందించారు. అలాంటి వ్యక్తిపై నేడు దుష్ప్రచారం చేయడం బాధ కల్గించింది. ఇటీవల మాకు స్థలం ఇస్తానని భరోసా ఇవ్వడంతో కేసు వెనక్కి తీసుకునేందుకు వచ్చా.
– లక్ష్మిదేవి, బాధిత రైతు, మోటుమర్ల

మోసం చేశారు..



టీడీపీ హయాంలో ఎకరాకు కేవలం రూ.5 లక్షల పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి ప్రస్తుత ప్రభుత్వం సాయం అందించే వీలు లేకుండా చేశారు. అయినప్పటికీ 5 సెంట్లు స్థలం ఇస్తామని కేతిరెడ్డి చెప్పిన మాటకు ఒప్పుకుని కేసు విత్‌డ్రా చేసుకుంటున్నాం.
– చెన్నమ్మ, మోటుమర్ల

జగన్‌తోనే సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 7 నుంచి 29 వరకు చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' పీపుల్స్ మెగా సర్వే దిగ్విజయంగా పూర్తయ్యిందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు కృషి చేశారని, వారందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత టీడీపీ హయాంలో ప్రజలు పడ్డ కష్టాలు, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని లబ్ధిదారులకు వివరించినట్లు వెల్లడించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని ప్రజలంతా విశ్వసిస్తున్నారన్నారు. మరోమారు సీఎంగా జగనే ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలుతో పాటు ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని తెలుసుకోవడం కోసం 'జగనన్నే మా భవిష్యత్తు' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని, ఇంతటి సాహసం ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో జీర్ణించుకోలేక ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని టీడీపీ దుష్ప్రచారానికి దిగుతోందన్నారు. వారెన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, అబూబకర్, రంగ, గృహసారథి అమీనా పాల్గొన్నారు.

ఆర్జిత కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవ సేవకు సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓ పట్టెం గురుప్రసాద్ కోరారు. 1, 8, 10, 12, 14, 15, 16, 17, 18, 21, 22, 23, 24, 25, 26 తేదీల్లో కల్యాణోత్సవం ఉంటుందన్నారు. రూ. 4 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక టికెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు సేవ ప్రారంభమవుతుందన్నారు.

కానుక.. మరింత నాణ్యత

- జగనన్న విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలనకు ప్రత్యేక కమిటీలు
- మండలస్థాయి కమిటీల ఆమోదం తర్వాతే కిట్ల సరఫరా
- పారదర్శకత కోసం బయోమెట్రిక్ విధానంలో పంపిణీ
- జిల్లాలో 2,22,212 మంది విద్యార్థులకు అందనున్న కిట్లు

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1 –10 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విద్యా కానుక' (జేవీకే) కింద ఇచ్చే కిట్‌లోని ప్రతి వస్తువూ ఈసారి మరింత నాణ్యంగా ఉండబోతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 2023–24 విద్యా సంవత్సరంలో ఇచ్చే కిట్లలోని వస్తువుల నాణ్యత పరిశీలనకు ప్రత్యేక కమిటీలు నియమించింది. నాణ్యత విషయంలో రాజీపడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా...సరఫరా ప్రక్రియ పూర్తయిన కొన్ని రోజులకు నాణ్యత లోపించిందంటూ అక్కడక్కడా ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీలు,



జగనన్న విద్యా కానుక కిట్టు నమూనా

బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూ, బెల్ట్ ఉంటాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,22,212 మంది 1–10 తరగతుల విద్యార్థులున్నారు. వీరికి అవసరమైన కిట్లకోసం ప్రభుత్వం రూ.36.66 కోట్లు ఖర్చు చేస్తోంది.

క్వాలిటీ కంట్రోల్ టీంలు..
జగనన్న విద్యా కానుక వస్తువుల నాణ్యతను పరిశీలించేందుకు మండల స్థాయిలో క్వాలిటీ కంట్రోల్ టీంలను ఏర్పాటు చేశారు. మండల ఇంజినీర్, ఏపీఎం (సెర్ప్) టీం సభ్యులుగా ఉంటారు. వస్తువుల నాణ్యత పరిశీలించేందుకు నమూనాగా రాష్ట్రస్థాయి వెండర్లు ఈ క్వాలిటీ కంట్రోల్ టీంలకు పంపుతారు. ఆ తర్వాత తీసుకొచ్చే వస్తువులు అదే నాణ్యతగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించాల్సిన బాధ్యత క్వాలిటీ కంట్రోల్ టీంలదే. మండలానికి అవసరమైన అన్ని వస్తువులూ వచ్చిన తర్వాత ర్యాండమ్‌గా (కనీసం 5 శాతానికి తగ్గకూడదు) పరిశీలించి నాణ్యతపై నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ఎక్కడైనా నాణ్యత లోపించినా, సంఖ్య తగ్గినా వెంటనే ఉన్నతాధికారులతో పాటు సంబంధిత వెండర్ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

మండలానికొక స్టాక్ పాయింట్..
జేవీకే కిట్ల కోసం ప్రతి మండలంలోనూ ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఆయా టెండరుదారుల నుంచి నేరుగా మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకే వస్తువులు వస్తాయి. అక్కడి నుంచి పాఠశాలలకు తరలిస్తారు. ఆయా స్కూళ్లలో హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా విద్యార్థులకు అందజేస్తారు. వస్తువులు ఎక్కడా పక్కదారిపట్టకుండా పారదర్శకత కోసం ప్రతి దశలోనూ బయోమెట్రిక్ విధానాన్ని తీసుకొచ్చారు. ప్రతి వస్తువుకూ లెక్క ఉంటుంది. ఒకవేళ తక్కువ వచ్చినా అది ఏ దశలో పక్కదారి పట్టిందో ఇట్టే తెలిసిపోతుంది.

పిడుగుపాటుతో నలుగురికి గాయాలు

నార్పల: మండలంలోని హెచ్.సోదనపల్లిలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు నలుగురు గాయపడ్డారు. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు తోటలో కుటుంబ సభ్యులు రామాంజనమ్మ, హర్ష, నల్లపరెడ్డిపల్లికి చెందిన కూలీ వనిత, మరికొంతమంది వ్యవసాయ పనులు చేస్తున్నారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, వనిత చీరకు వ్యాపించాయి. పక్కనే ఉన్న రామాంజనేయులు, రామాంజనమ్మ, హర్షకు గాయాలయ్యాయి. సమీపంలోని వారు వెంటనే మంటలు ఆర్పి, వనితతో పాటు మిగిలిన ముగ్గురినీ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు వనితను మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

సొసైటీ సభ్యుల సొమ్ము స్వాహా

- తపాలా శాఖ కో–ఆపరేటివ్ సొసైటీలో వెలుగు చూసిన అక్రమాలు
- సమగ్ర విచారణ కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు
- సొసైటీ ఎన్నికల నేపథ్యంలో తెరపైకి వచ్చిన లోగుట్టు వ్యవహారాలు
- అక్రమాలు నిగ్గుతేలే వరకూ ఎన్నికల ప్రక్రియ వాయిదా వేయాలని వినతి

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా శాఖకు చెందిన కో–ఆపరేటివ్ సొసైటీలో లోగుట్టుగా సాగిన అక్రమాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. కో–ఆపరేటివ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఈ ఉదంతం వెలుగు చూడడంతో ఆ శాఖ ఉద్యోగుల్లో కలకలం రేగింది. సొసైటీలో చోటు చేసుకున్న ఆర్థిక అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ కోరుతూ జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) గౌతమికి సభ్యులు ఫిర్యాదు చేశారు.

కరోనా పరిస్థితులను 'క్యాష్' చేసుకుని..
అనంతపురం పోస్టల్ కో–ఆపరేటివ్ సొసైటీకి చివరిసారిగా 2015లో ఎన్నికలు నిర్వహించారు. ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాత 2020లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో కరోనా, లాక్‌డౌన్ వంటి పరిస్థితులు నెలకొనడంతో ఎన్నికల నిర్వహణను అధికారులు చేపట్టలేదు. దీంతో కొందరు సభ్యులు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. కేవలం ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే మిగిలారు. ఇదే అదనుగా వారు అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సొసైటీలో తీసుకున్న రుణాలకు సంబంధించి ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసిన మొత్తానికి, సొసైటీలో జమ చేసిన మొత్తానికి భారీగా వ్యత్యాసాలు ఉండడం గమనించిన ఉద్యోగులు బెంబేలెత్తిపోయారు. వాస్తవానికి చెల్లించాల్సిన మొత్తాని కంటే ఎక్కువ వసూలు చేయడం, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడం, ప్రశ్నించిన సభ్యులకు పొంతన లేని సమాధానాలు ఇవ్వడం వంటి అంశాలు ప్రస్తుతం



చర్చనీయాంశమయ్యాయి.

ఎన్నికల ప్రక్రియకు ముందే వెలుగులోకి..
తపాల కో – ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ఈ నెల ఒకటిన మొదలుపెట్టేలా అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. తొలిరోజు నామినేషన్ ప్రక్రియ, 2న పరిశీలన, 3న ఉపసంహరణ, అనంతరం బరిలో మిగిలిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, 7న పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యే ఒక్క రోజు ముందు సొసైటీలో చోటు చేసుకున్న అక్రమాలు వెలుగులోకి రావడంతో కొందరు ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. ఎన్నికలను వాయిదా వేసి, సొసైటీలో చోటు చేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ జిల్లా మేజిస్ట్రేట్ ఎం.గౌతమికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేత్రపర్వం.. వాసవీమాత జయంత్యుత్సవం





అనంతపురం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, కొత్తూరులో వాసవీమాత నగరోత్సవం



పాతూరులో కలశాలు, పూర్ణకుంభాలతో ర్యాలీగా వెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు ఆదివారం అనంతపురంలో నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం రాజు రోడ్డులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో కొత్తూరు అమ్మవారిశాల అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు వాసవీ జయంతి విశిష్టతను, ఆర్యవైశ్యుల సేవా తత్పరతను వివరించారు. అనంతరం పూలతేరుపై అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భజన బృందాలు ముందు నడుస్తుండగా మంగళవాయిద్యాల నడుమ వాసవీ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఏకరూప వస్త్రధారణతో మహిళలు కలశాలు, పూర్ణకుంభాలను తలపై ధరించి ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. రుత్వికులు వాసవీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టంగటూరు నాగభూషణం, మురళీ, క్రిష్ణం రఘు, సూర్యప్రకాష్, రమేష్‌బాబు, పువ్వాళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

- అదేవిధంగా పాతూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఉదయం భక్తజనసంద్రంగా మారింది. అధ్యక్షులు పిన్ని నాగరత్నం ఆధ్వర్యంలో వాసవీ హోమం నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారి రథం ముందు మహిళలు ఆనందోత్సాహాల మధ్య కోలాటంపై నర్తించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి.

ఎస్కేయూకు ఇస్రో దన్ను

- వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమగ్ర అధ్యయనం
- రూ.6 కోట్ల విలువైన మూడు భారీ రీసెర్చ్ ప్రాజెక్ట్‌ల మంజూరు



ఎస్కేయూ ముఖద్వారము

అనంతపురం: క్షణాల వ్యవధిలోనే వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రోజుల వ్యవధిలోనే అంతా తారుమారవుతోంది. ఈ పరిస్థితుల్లో రాయలసీమ జిల్లాల్లో వాతావరణంలో చోటు చేసుకుంటున్న అనూహ్య మార్పులపై పూర్తిస్థాయి అధ్యయనం చేసేలా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పూర్తి సహకారం అందజేస్తోంది. ఇందుకోసం వర్సిటీకి అత్యాధునికమైన పరికరాలను సమకూర్చింది. వర్సిటీ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాంగోపాల్ ఆధ్వర్యంలో సీమ జిల్లాల్లోని వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు పరిశోధనలు చేసి, వాటి ఫలితాలను ఇస్రోకు చేరవేస్తున్నారు.

వర్షాభావానికి కారణాలివే..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని చుట్టూ వంద కిలోమీటర్ల పరిధిలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేలా ఆధునిక పరికరాలను ఇస్రో అందజేసింది. గాలిలోని కాలుష్యం నుంచి వెలువడే అతి సూక్ష్మ కార్బన్ అణువులు మేఘాల్లో సూర్య రశ్మిని శోషించుకుని అధిక వేడికి కారణమవుతాయి. దీని వల్ల మేఘాలు క్షీణిస్తాయి. భౌగోళికంగా రాయలసీమ వర్షాచ్ఛాయా ప్రాంతంలో ఉంది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ప్రయాణించే దిశలోనే సమృద్ధిగా వర్షాలు పడతాయి. కానీ ఆ దిశలో రాయలసీమ ప్రాంతం లేనందున వర్షాభావం నెలకొంటోంది. సాధారణంగా వర్షం కురవాలంటే గాలి వేగం గంటకు 30 కిలోమీటర్లు ఉండాలి. కానీ రాయలసీమ ప్రాంతాల్లో జూన్, జూలై మాసాల్లో గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. దీంతో మేఘాలు విచ్ఛిన్నమై వర్షాలు కురవడం లేదు.

ఆరోగ్యానికి హానికరమైన అంశాలపై పరిశోధన..

మానవాళికి రక్షణ కవచంగా పనిచేస్తున్న ఓజోన్ పొర పదిహేను కిలోమీటర్ల ఎత్తులో ఎంత దట్టంగా ఉంటే అంత ఎక్కువ రక్షణ ఉంటుంది. అదే ఓజోన్ శాతం భూమి మీద ఎక్కువగా ఉంటే ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు, పంటల క్షీణతకు కారణమవుతాయి. ఓజోన్ శాతం భూమి మీద 100 పీపీబీవీల కంటే ఎక్కువ ఉంటే ఇబ్బందులు తప్పవు. ఎస్కేయూ ప్రాంతంలో ఓజోన్ శాతం 60 పీపీబీవీలుగా ఉంది. రుతువుల ఆధారంగా ఓజోన్ శాతం మారుతుంటుంది. కాలుష్యం వల్ల వెలువడే కార్బన్‌డయాక్సైడ్ రక్తంలో కలసి కార్బక్సీ హిమోగ్లోబిన్‌గా మారుతోంది. దీనివల్ల గుండె, మెదడు నరాలకు హాని కలుగుతోంది. పొగలోని కణరూప పదార్థాలు మ్యూకస్ మెంబ్రేన్‌ను దెబ్బతీయడమే కాకుండా శ్వాసకోశ సంబంధమైన వ్యాధులను కలుగజేస్తాయి. గాలిలో సూక్ష్మకణాల సంఖ్య అధికంగా ఉంటే ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు.

ఆధునిక యంత్రాలతో పరిశోధన..

వివిధ కారణాలతో రాయలసీమ ప్రాంతంలోని వాతావరణలో చోటు చేసుకుంటున్న మార్పులపై సమూలంగా అధ్యయనం చేసేందుకు ఎస్కేయూకు అత్యంత ఆధునిక యంత్ర పరికరాలను ఇస్రో సమకూర్చింది. వీటిని అమెరికా, ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్నట్లు సమాచారం. పది ఫిల్టర్ల సాయంతో సూర్య వికిరణాన్ని కొలిచే మల్టీవేవ్‌లెంగ్త్ సోలార్ రేడియో మీటర్, గాలిలో అతి సూక్ష్మరేణువులను గుర్తించే క్వార్ట్జ్‌క్రిస్టల్ మైక్రో బ్యాలెన్స్, ఓజోన్, కార్బన్‌డయాక్సైడ్ నైట్రస్ ఆక్సైడ్‌లను గుర్తించే పరికరం. బ్లాక్ కార్బన్ అణువులను పసిగట్టే అథిలోమీటర్‌తో పాటు విలువైన ఎన్నో పరికరాలను ఎస్కేయూ అందిపుచ్చుకుని జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

మూడు భారీ రీసెర్చ్ ప్రాజెక్టులు..

వాతావరణంలో కాలుష్యం పెరగడానికి దోహదపడే అంశాలపై ఎస్కేయూ వేదికగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మూడు భారీ రీసెర్చ్ ప్రాజెక్టులను ఇస్రో సాయంతో చేపట్టారు. ఇప్పటి వరకూ రూ.6 కోట్ల నిధులను వర్సిటీకి ఇస్రో విడుదల చేసింది. ఇప్పటికే రూ.2 కోట్ల విలువైన పరికరాలు సమకూరాయి. మరో మూడేళ్ల పాటు మూడు ప్రాజెక్టులు కొనసాగేలా తాజాగా ఉత్తర్వులు అందాయి. ఈ ప్రాజెక్టుల పరిశోధనల ఫలితంగా ఇప్పటి వరకూ మొత్తం 95 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఈ పరిశోధన పత్రాలకు 2017లో నాసా నిర్వహించిన హాల్ ఆఫ్ ఫ్రేమ్ ఇమేజ్‌లోచోటు దక్కింది. 20 మందికి డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. అంతర్జాతీయంగా 8 పుస్తకాలు ముద్రించారు. ఇవన్నీ ప్రపంచ స్థాయిలో టాప్-10 జాబితాలో నమోదు కావడం గమనార్హం. ఈ పరిశోధనల ఫలితంగా ఏడుగురు పీహెచ్‌డీ విద్యార్థులు సింగపూర్, చైనా, తైవాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో పోస్ట్-డాక్టరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. వాతావరణ శాస్త్రంలో చేసిన విస్తృత పరిశోధనలకు గుర్తింపుగా నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ - న్యూఢిల్లీ వారిచే నాలుగు అవార్డులు దక్కాయి. ఇందులో పరిశోధన చేసిన డాక్టర్ బోరెడ్డి సురేష్‌కుమార్ రెడ్డికి విక్రమ్‌సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సైంటిస్ట్‌గా అవకాశం దక్కింది.

వాతావరణ మార్పులపై సమగ్ర అధ్యయనం



వాతావరణంలో చోటు చేసుకుంటున్న అనూహ్య మార్పులపై సమగ్ర అధ్యయనం చేయడానికి వీలుగా జీపీఎస్ హండే అనే పరికరం దోహదపడుతోంది. ఈ పరికరాన్ని బెలూన్‌కు అమర్చి ఆకాశంలో వదిలితే చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలోని ఉష్ణోగ్రత, పీడనం, గాలి వేగం, గాలి దిశ, ఆర్ద్రత (గాలిలో ఉండే భాష్పము)లను కనుగొనవచ్చు. ఇటీవలే ఈ ప్రయోగాల కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని వెనుక ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి కృషి అపారం. ఈ ప్రాజెక్ట్ కింద పనిచేస్తున్న పరిశోధన విద్యార్థులకు ఫెలోషిప్ అందజేస్తాం.

– డాక్టర్ కె.రాంగోపాల్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇస్రో ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ఎస్కేయూ

వర్సిటీకి జాతీయ స్థాయి గుర్తింపు



ప్రాంతీయ వాతావరణ పరిశోధనలకు ఇస్రో సహకారం దక్కడం గర్వకారణం. దీంతో ఎస్కేయూకు జాతీయ స్థాయిలో ఖ్యాతి లభించింది. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయడంలో వర్సిటీ భాగస్వామ్యం కావడం అభినందనీయం.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

క్లుప్తంగా

హత్యకేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ: వజ్రకరూరు మండలం బోడిసానిపల్లి పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటు చేసుకున్న ఆటో డ్రైవర్ దూదేకుల అబ్దుల్లా (31) హత్యకేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఉరవకొండ పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శేఖర్ వెల్లడించారు. గుంతకల్లు బెస్త కాలనీకి చెందిన రసూల్‌బీ, మస్తానయ్య దంపతుల కుమారుడు దూదేకుల అబ్దుల్లా (31) అద్దె ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఏడు నెలల క్రితం గుంతకల్లు భాగ్యనగర్ నివాసి బోయ గోపాల్‌ను కలసి ద్విచక్ర వాహనం ఇప్పించుకుని వెళ్లాడు. నెలలు గడిచినా ఆ వాహనాన్ని అబ్దుల్లా తిరిగి అప్పగించలేదు. ఈ విషయంగా గోపాల్ నిలదీసిన ప్రతిసారీ ఘర్షణ పడేవాడు. అంతటితో ఆగకుండా వజ్రకరూరులో నివాసముంటున్న గోపాల్ భార్య గురించి అనుచితంగా మాట్లాడుతూ అవమానించేవాడు. తన భార్య గురించి చెడుగా మాట్లాడడంతో కక్ష పెంచుకున్న గోపాల్.. ఎలాగైనా అబ్దుల్లాను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం ఏప్రిల్ 21న ఆటోకు బాడుగ ఉందంటూ పామిడి మండలం నెమళ్లపల్లికి అబ్దుల్లాని గోపాల్ పిలుచుకెళ్లాడు. అక్కడకు చేరుకున్న తర్వాత ఫుల్‌గా మద్యం తాపాడు. అనంతరం తిరుగు ప్రయాణమవుతూ బోడిసానిపల్లి పరిసరాలకు చేరుకోగానే కత్తితో గొంతుకోసే ప్రయత్నం చేశాడు. దాడి నుంచి తప్పించుకున్న అబ్దుల్లా పారిపోయేందుకు ప్రయత్నించగా.. గోపాల్ స్నేహితుడు దూదేకుల హుస్సేన్‌పీరా అడ్డుకున్నాడు. అనంతరం గోపాల్ కత్తితో అబ్దుల్లా ముఖంపై, ఎదపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం ఆటోను ఎక్కడైనా కాలువలో పడేయాలని తీసుకెళుతుండగా వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లో ఇంధనం అయిపోవడంతో వాహనం ఆగిపోయింది. దీంతో ఆటోను అక్కడే వదిలేసి ఉడాయించారు. ఘటనపై కేసు నమోదు చేసిన వజ్రకరూరు పోలీసులు పక్కా ఆధారాలతో ఆదివారం ఉదయం కమలపాడు క్రాస్ సమీపంలో గోపాల్, హుస్సేన్ పీరాను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో అబ్దుల్లా హత్యకు కారణాలు బయటపడ్డాయి. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో చొరవ చూపిన వజ్రకరూరు ఎస్‌ఐ వెంకటస్వామి, సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ శేఖర్ అభినందించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట్లకు చెందిన ఖాసీంపీరా (40)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శనివారం రాత్రి మర్తాడు నుంచి నడుచుకుంటూ యర్రగుంట్లకు వస్తుండగా మర్తాడు శివారులోని హెచ్చెల్సీలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నూతన కార్యవర్గం.. ఏకగ్రీవం



ఎంపికైన కార్యవర్గ సభ్యులు

రాప్తాడు రూరల్: ఆలిండియా షెడ్యూల్డ్ కులాలు, తెగల వెనుకబడిన తరగతులు, మైనార్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్సీఈడబ్ల్యూఏఎస్‌టీఏఎంబీ) అనంతపురం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ ప్రక్రియ ముగిసింది. జిల్లా అధ్యక్షుడిగా వంకరాజుకాల్వ గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ బాబు, కోశాధికారిగా నాగముని, సీనియర్ వైస్ ప్రెసిడెంట్లుగా వలిగొండ రామకృష్ణ, విజయ్ కుమార్, జయరామ్, వైస్ ప్రెసిడెంట్లుగా కోటి మల్లేశు, వి.కుళ్లాయప్ప, ఎం.సురేష్, ఆర్.ఎస్.శ్రీనాథరావు, వై.భైరవ కుమార్, ప్రభాకర్, మహమ్మద్ రఫీ, బి.లక్ష్మి దేవి, ఈసీ మెంబర్లుగా స్రవంతి, దుర్గా, నరేంద్ర, పి.వెంకటేశు ఎన్నికయ్యారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎ.రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అకాల వర్షాలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పామిడిలో 46.2 మి.మీ, గార్లదిన్నె 44, శింగనమల 37, యల్లనూరు 23.4, పుట్లూరు 22.6, పెద్దవడుగూరు 18.2, వజ్రకరూరు 16.6, కళ్యాణదుర్గం 11.2 మి.మీతో పాటు మరికొన్ని మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షపాతం నమోదైంది. బలమైన గాలులు వీయడంతో పలు మండలాల్లో ఉద్యాన పంటలకు రూ.75 లక్షల వరకు నష్టం వాటిల్లగా.. వ్యవసాయ పంటలకు రూ.1.70 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

- ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

తాడిపత్రి: పెన్నా సిమెంట్స్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న సోదం రామకృష్ణారెడ్డి (35) ఆదివారం మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామం వద్ద ఉన్న ఆ కంపెనీ గ్యారేజీలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గ్యారేజీ ఆవరణలోని ఓ చెట్టుకు ఉరికి వేలాడుతూ కన్పించాడు. అయితే.. అతన్ని హత్య చేసినట్లు ఆరోపిస్తూ గ్యారేజీ వద్ద భార్య సుమలత బంధువులతో కలసి ఆందోళన చేపట్టారు. సుమలత తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా సంజామల మండలం మంగపల్లికి చెందిన సోదం రామకృష్ణారెడ్డి పెన్నా సిమెంట్స్ లారీ డ్రైవర్‌గా 15 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఇటీవలనే కుటుంబాన్ని పులివెందుల పట్టణానికి మార్చాడు. వారానికి ఒకమారు ఊరికి వెళ్లి వచ్చేవాడు. ఈ నెల 15న డ్యూటీకని వచ్చిన రామకృష్ణారెడ్డి మరుసటి రోజే డ్యూటీ దిగినట్లు భార్యకు చెప్పాడు. లారీ మరమ్మతుతో పాటు అప్రూవల్ రావాల్సింది ఉందని, కావున ఊరికి రాలేకపోతున్నానని తెలిపాడు. కాగా..రామకృష్ణారెడ్డి ఆదివారం మధ్యాహ్నం గ్యారేజీ ఆవరణలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్న స్థితిలో కన్పించాడు. సిబ్బంది అతన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే..తన భర్త హత్యకు గురైనట్లు ఆరోపిస్తూ భార్య సుమలత బంధువులతో కలసి ఆదివారం రాత్రి గ్యారేజీ వద్ద ధర్నాకు దిగారు. సిమెంట్ లోడ్‌తో గ్యారేజీకి వచ్చిన తరువాత పట్టా విప్పి ఏదో బస్తాను లారీలో ఎక్కించారని, అది బెంగళూరులో చేరాల్సిన చోటుకు చేరకపోవడంతో గ్యారేజీ నిర్వాహకులు తన భర్తను వేధించి చంపారని ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంకా కేసు నమోదు చేయలేదు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ ఏషియన్ పోటీలకు ఎంపికైన రైతుకూలీ బిడ్డలు



శివకుమార్



లక్ష్మీకళ్యాణ్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ ఏడాది జూన్ 21 నుంచి 24వ తేదీ వరకూ జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన రైతు కూలీ బిడ్డలు ఇద్దరు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, నాగేంద్రమ్మ దంపతుల కుమారుడు శివకుమార్, బెళుగుప్పకు చెందిన అరుణ, తిప్పేస్వామి దంపతుల కుమారుడు లక్ష్మీకళ్యాణ్ ఉన్నారు. శివకుమార్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. పూట గడవడమే కష్టంగా ఉన్న రోజుల్లోనూ కుమారుడి చదువులను ఎక్కడ ఆపలేదు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన శివకుమార్ సైతం పట్టుదలతో చదువుకుని, ప్రస్తుతం బీపీఈడీ విద్యను అభ్యసిస్తున్నాడు. గుట్టూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నప్పుడు పీడీ నాగేంద్ర అతనిలోని ప్రతిభను గుర్తించి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశాడు. ఈ ఏడాది అనంతలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన భారత జట్టు ఎంపికల్లో సత్తా చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. లక్ష్మీకళ్యాణ్ తల్లిదండ్రులు సైతం సాధారణ వ్యవసాయ కూలీలే. కళ్యాణదుర్గంలోని కేసీ చిన్నప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలు సత్యనారాయణ, కుళ్లాయిస్వామి ప్రోత్సాహంతో సాఫ్ట్‌బాల్ క్రీడలో ప్రవేశించాడు. ప్రస్తుతం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు.

గానగంధర్వుడికి ఉపాధ్యాయుల ఘన నివాళి



పాటలు పాడుతున్న డీఈఓ సాయిరాం

అనంతపురం కల్చరల్: పాఠాలే కాదు పాటలతోనూ తాము మంత్ర ముగ్ధులను చేయగలమని నిరూపించారు జిల్లాకు చెందిన పలువురు ఉపాధ్యాయులు. ఆదివారం రాత్రి లలితకళాపరిషత్తు వేదికగా 'బాలు సుస్వరాల సుమధుర గీతమాల' పేరుతో సాగిన సాంస్కృతిక సంబరం ఇందుకు వేదికైంది. 'అనంత ఉపాధ్యాయ కళా సమితి' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. అనంత ఉపాధ్యాయ కళా సమితి అధ్యక్షుడు బాలమురళీకృష్ణ, శ్రీదేవి, రామాంజి, కృపాకిరణ్, విజయలక్ష్మి తదితరులు పాత మధుర గీతాలతో శ్రోతలను అలరించారు. స్వయంగా డీఈఓ సాయిరాం సైతం పాటలు పాడి అందరినీ ఉత్సాహ పరిచారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం గొప్పతనాన్ని డీఈఓ సాయిరాం, ఏసీ గోవిందనాయక్ కొనియాడారు.

ప్రమాదంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మృతి



రత్నమ్మ (ఫైల్)

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో రాయదుర్గం మార్కెట్ యార్డు డైరెక్టర్ రత్నమ్మ మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్టకు చెందిన గంధవీడి తిప్పేస్వామి, రత్నమ్మ (55) దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నామినేటెడ్ పదవుల్లో మహిళలకు తొలి ప్రాధాన్యతనివ్వడంతో రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా రత్నమ్మకు అవకాశం దక్కింది. శనివారం భర్తతో కలసి వ్యవసాయ పనులకు వెళ్లిన రత్నమ్మ... సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో పెనుగాలులతో కూడిన వర్షం మొదలుకావడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో తలకు తీవ్ర గాయమైన రత్నమ్మను స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. రత్నమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి ఆదివారం ఉదయం గుమ్మఘట్టకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రత్నమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, అంత్యక్రియల్లో సర్పంచ్ అనిల్, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ పాల్గొన్నారు.

● అపూర్వ కలయిక



నార్పల: మూడు దశాబ్దాల తర్వాత ఆనాటి విద్యార్థులు ఒక్కటయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆడారు.. పాడారు.. నాటి మధుర స్మృతులను, చిలిపి తగాదాలను జ్ఞాపకం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు నార్పలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది. 1991లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం ఒక్కటయ్యారు. 32 ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారు అనంతపురము జిల్లా, అనంతపురము మండలం, మన్నేల గ్రామం సర్వేనెం.28/భాగం మరియు సర్వేనెం.28 నందు రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోన్ & గ్రావెల్ రెండు మైనులు ఏర్పాటు కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1.	కంపెనీ పేరు చిరునామాతో & టెలిఫోన్ నెంబరుతో	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, సర్వేనెం.28/భాగం & సర్వేనెం.28, మన్నేల గ్రామం, అనంతపురము మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్: 8121186817
2.	ప్రతిపాదిత స్థాపన యొక్క ప్రదేశం మరియు భూమి విస్తీర్ణం వివరాలు	
3.	సంప్రదించాల్సిన అధికారిపేరు మరియు చిరునామా	శ్రీ ఎం.సుందరయ్య, ఫోన్:8121186817

వ.సం.	క్వారీలీజు ఏరియా వివరములు		
i)	క్వారీ లీజు ఏరియా పేరు	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్
ii)	క్వారీ లీజు ఏరియా విస్తీర్ణం	13.665 హెక్టార్లు	5.623 హెక్టార్లు
iii)	క్వారీలీజు ప్రదేశం	సర్వేనెం.28/భాగం,మన్నేల గ్రామం,అనంతపురము మండలం, అనంతపురము జిల్లా	సర్వేనెం.28, మన్నేల గ్రామం అనంతపురము మండలం, అనంతపురము జిల్లా

4. ప్రతిపాదించిన ప్రాజెక్టుకు కేటాయించబడిన పెట్టుబడి

వ.నెం.	క్వారీలీజు ఏరియా పేరు	రూపాయల్లో
1.	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (13.665హెక్టార్లు)	రూ.100 లక్షలు
2.	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (5.623హెక్టార్లు)	రూ.50 లక్షలు

5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు

వ. నెం.	క్వారీ లీజు ఏరియా పేరు	క్వారీ లీజు ఏరియా విస్తీర్ణం	మైనింగ్ క్వాంటిటీ
1	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.	13.665 హెక్టార్లు	ఏడాదికి 3,36,026 m3/Annum రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను & గ్రావెల్-63,528 m3/Annum
2	మెస్సర్స్ బివిఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్	5.623 హెక్టార్లు	ఏడాదికి 76,016 m3/Annum రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను & గ్రావెల్-98,895 m3/Annum

6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం: **తేది: 02.06.2023 సమయం: ఉ.11.00 గంటలకు, ప్రదేశం : ప్రతిపాదిత మైనుల స్థలం** సమీపంలో అనగా మన్నేల గ్రామం, అనంతపురము మండలం, అనంతపురము జిల్లా

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము జిల్లా
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్ఓ.) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ – 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, అనంతపురము మండలం, అనంతపురము జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, మన్నేల గ్రామం, అనంతపురము మండలం, అనంతపురము జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7III(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహించబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

ప్రదేశం : అనంతపురము
తేది : 30.04.2023

సం/- పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

క్లుప్తంగా

మన్‌కీ బాత్ కొనసాగాలి

• ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య



మన్‌కీ బాత్ లో పాల్గొన్న ఎంపీ రంగయ్య

అనంతపురం క్రైం: దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలని ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఆలిండియా రేడియో స్టేషన్ నుంచి మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని, కార్యక్రమాన్ని వీక్షించారు. ఎంపీ మాట్లాడుతూ 2014 అక్టోబర్ 3న మన్ కీ బాత్ కార్యక్రమం మొదలై, ఇప్పటి వందో ఎపిసోడ్ పూర్తి చేసుకుంటోందన్నారు. సామాన్యులు సాధించే విజయాలు, గొప్ప వ్యక్తుల కలలు, చేతి వృత్తుల సేవా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాల ఈ కార్యక్రమానికి ప్రజలను మరింత దగ్గరచేశాయన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ తలారి రంగయ్యను రేడియో స్టేషన్ అధికారులు సన్మానించారు.

విశ్రాంత వైద్యుడికి సన్మానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: సర్వజనాస్పత్రి ఈఎన్‌టీ విభాగ హెచ్‌ఓడీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ నవీద్ అహమ్మద్‌ను ఎంపీ తలారి రంగయ్య ఆదివారం సన్మానించారు. ఆయనకు ఎంపీ పుస్తకాన్ని కానుకగా అందించారు. నవీద్ అహ్మద్ సేవలు ఎనలేనివని కొనియాడారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా సీనియర్ బేస్‌బాల్ ఎంపికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. ఆర్డీటీ ప్రోత్సాహంతో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్‌రెడ్డి, నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లా పురుషుల, మహిళల జట్టు ఎంపిక నిర్వహించామన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 13 నుంచి 15 వరకు అనంత జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుల ఆరాధనోత్సవాలు



పూజలందుకున్న వీరబ్రహ్మేంద్రులు

అనంతపురం కల్చరల్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక రాణినగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు గురుప్రసాద్, అధ్యక్షులు రంగాచారి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ ఆచారి, బాలాజీ ఆచారి పాల్గొన్నారు.

☛ స్థానిక పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబాదేవి జయంతిని అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతినిధి రమేష్ నేతృత్వంలో నవగ్రహ, శాంతి, చండీ హోమాలు జరిగాయి.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

రాప్తాడు: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఆదివారం స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వరకు అన్నదానం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు గౌరవ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ సీపీ రాప్తాడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, జయన్న పూజల్లో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహం ఏర్పాటు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నర్సుల ఆరాధ్య దైవం ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేశారు. ఈనెల 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు తెలిపారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి హాజరవుతారన్నారు.

నిర్మల్ దోస.. అ'ధర'హో

మే నెల వచ్చేసింది. వేసవి ఎండలు మండుతున్నాయి. ఈసీజన్‌లో పలు రకాల పండ్లు కొనుగోలుకు జనం ఆసక్తి చూపుతారు. వేసవిలో చల్లదనం ఇచ్చే పండ్లలో ఒక్కటైన దోస.. రైతుకు, వ్యాపారులకు చక్కని లాభాలను కూడా ఇస్తుంది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం చిగిచెర్లకు చెందిన రైతు హనుమంతరెడ్డి సాగు చేసిన 'నిర్మల్ దోస' సిరులు కాస్తోంది. దిగుబడితోపాటు ధర కూడా ఆశించిన స్థాయిలో ఉంది. కిలో దోస రూ.18 నుంచి రూ.20 ధర పలుకుతోంది. రైతు కోల్‌కత్తా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల మార్కెట్లకు తరలిస్తున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:









ప్రమాదాల రహిత నగరమే లక్ష్యం

• ప్రతి చోటా సీసీ కెమెరాలు, హోర్డింగ్‌లతో అప్రమత్తం



ట్రాఫిక్ పోలీసు స్టేషన్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంత నగర రూపురేఖలు మారుతున్నాయి. నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. వ్యాపార సముదాయాలూ వెలుస్తున్నాయి. ప్రధానంగా నగరం చుట్టూ కిలోమీటర్ల మేర హోటళ్లు, రెస్టారెంట్లు పుట్టుకొచ్చాయి. పెరుగుతున్న జనాభాకనుగుణంగా వాహనాల రద్దీ కూడా పెరిగింది. ప్రమాదాల సంఖ్య కూడా క్రమేణా పెరుగుతోంది. నగర ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాలను నియంత్రించేందుకు శ్రీకారం చుట్టారు. నగరం బాగా అభివృద్ధి చెందుతోంది. గతంలో 3 లక్షలకు పైచిలుకు ఉన్న జనాభా కాస్తా 5 లక్షలు దాటింది. దీంతో వాహనాల సంఖ్య కూడా పెరిగింది. రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. 2021లో ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా 658 మంది గాయపడగా, 351 మంది మృతి చెందారు. 2022లో 576 మంది గాయపడగా, 321 మంది చనిపోయారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. రోజుకు సగటున 2 నుంచి 5 ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నియంత్రణకు నగరంలో 6 బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. హోర్డింగులు ఏర్పాటు చేసి, వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 42 పాయింట్లలో ట్రాఫిక్ సిబ్బంది సేవలు అవసరమని గుర్తించారు. అక్కడ నిత్యం సిబ్బంది సేవలందించేలా ప్రణాళిక రూపొందించారు.

మానవ తప్పిదాలతో ప్రమాదాలు



జిల్లా కేంద్రంలోకి గ్రామీణ ప్రాంతాల నుంచి పనులపై వచ్చేవారు వాహనాలపై రావాలంటే జడుస్తున్నారు. యువకులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ తోటి వాహనదారులు, పాదాచారులకు అసౌకర్యం కలిగిస్తున్నారు. రోడ్డుపై వాహనాన్ని వేగంగా నడిపేటప్పుడు తోటి వాహనదారుడు, పాదాచారులను దృష్టిలో ఉంచుకోవాలి. వేగమే ప్రమాదాలకు కారణం.

– తలారి లింగప్ప ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు

ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

"నగరం బాగా అభివృద్ధి చెందుతోంది. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధి కూడా పెరిగింది. దీంతో నగరంలో ప్రమాదాల సంఖ్య పూర్తిస్థాయిలో తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు సహకరించాలి. నగరంలో వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో, వాహనాలను నడిపేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే సమస్యలు రావు. ఆటోలు రోడ్డుకు అడ్డం పెట్టి బేరాలు ఆడటం , ఇష్టారాజ్యంగా వాహనాన్ని నడపరాదు. మానవతప్పిదాలతో అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలపై యువత అవగాహన పెంచుకోవాలి.



– వెంకటేష్‌నాయక్, ట్రాఫిక్ సీఐ

శ్రీశ్రీ కవిత్వం ఆదర్శం



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అభ్యుదయ భావజాలంతో తెలుగు సాహిత్యాన్ని, కవిత్వాన్ని ఉర్రూతలూగించిన శ్రీ శ్రీ కవిత్వం ఎందరికో ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మహాకవి శ్రీశ్రీ జయంతిని అనంత జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సుంకర రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అనంత జిరసం అధ్యక్ష కార్యదర్శులు సాకే శ్రీహరిమూర్తి, తోట నాగరాజు, విశాలాంధ్ర విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు సాహిత్యభారతి గౌరవాధ్యక్షుడు డాక్టర్ పతికి రమేష్ నారాయణ, మురళీకృష్ణ, రాంభూపాల్, సపారె రాజశేఖర్ తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

అనంతపురం అర్బన్: స్థానిక శ్రీశ్రీ నగర్‌లో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు సీపీఎం ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ పేదరికం కోరల్లో నలుగుతున్న కష్టజీవుల బతుకులను కవితలుగా రాసిన మొట్ట మొదటి కవి శ్రీశ్రీ అన్నారు. యువతరాన్ని ఉత్తేజపరిచే విప్లవ గేయాలను రాసి సమస్యలపై పోరాట స్ఫూర్తిని నింపారన్నారు. శ్రీశ్రీ రచనలు, కవితలు నేటికీ సామాన్య ప్రజానీకాన్ని చైతన్య పరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వలి, ప్రకాశ్‌రెడ్డి, కుమార్, రాఘవ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శ్రీశ్రీ కళావేదిక శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్కేయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా, శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ గౌరవాధ్యక్షులు డాక్టర్ పతికి రమేష్ నారాయణ విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ ప్రధాన కార్యదర్శి కనుమల మునిస్వామి, కోశాధికారి కే సంగాలు, డాక్టర్ బత్తల అశోక్ కుమార్, చంద్రకళ, శివకుమార్, బి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



40వ డివిజన్‌లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. ఆదివారం నగరంలోని 40వ డివిజన్‌లోని సత్యదేవనగర్, ఆజాద్‌నగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ఎమ్మెల్యే వివరించారు. స్థానికంగా కొంత మంది చెప్పినా సమస్యలను ఎమ్మెల్యే ఓపిగ్గా విని, సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా కల్పించారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న పలువురు సచివాలయ కార్యదర్శుల పట్ల ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యం మెరుగునకు మరింత కృషి చేయాలన్నారు. చెత్త సేకరణ, రోడ్లు, కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. ప్రజలు సైతం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా క్లాప్ ఆటోలు, పారిశుధ్య సిబ్బందికి ఇచ్చేలా..వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. జాబ్‌చార్ట్ కనుగుణంగా ప్రతి సచివాలయ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కాలువలపై నిర్మాణాలు చేపడితే ఏమాత్రం ఉపేక్షించకుండా తొలగించాలన్నారు. సత్యదేవనగర్‌లో రెండు రోడ్లు, కాలువ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ మేలు మరువలేం:

ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా నా కూతురు బీటెక్ చదువుతోందని, చేయూత, సున్నావడ్డీతో వస్తున్న డబ్బుతో బాబు చదువుకు ఉపయోగపడుతోందని కామేశ్వరి అనే గృహిణి ఎమ్మెల్యే వద్ద సంబరంగా తెలిపింది. ప్రభుత్వం చేసిన మేలు మరువలేమని తెలిపింది. వాహనమిత్ర క్రమం తప్పకుండా వస్తోందని ఆటోడ్రైవర్లు అనిల్, అశోక్,సురేష్‌లు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అనువైన స్థలం కేటాయించాలి..

కామారుపల్లి స్థలానికి బదులుగా మరో ప్రాంతంలో అనువైన స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓ మధుసూదన్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. అధిక సంఖ్యలో లబ్ధిదారులు స్థల కేటాయింపుపై ఫిర్యాదు చేస్తున్నారని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, స్థానిక నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, పెన్నోబులేసు, అనిల్‌కుమార్‌గౌడ్, ఖాదర్, షరీఫ్, లక్ష్మణ్, కృష్ణవేణి, పార్వతి, రాధాయాదవ్, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఇస్సాక్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగ దిన'మే'

• సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



అనంతపురం అర్బన్: ఎనిమిది గంటల పనిదినం, శ్రామిక వర్గ హక్కుల సాధనకు పోరాటం చేసి, ప్రాణాలు అర్పించిన చికాగో అమర వీరుల త్యాగదినం రోజున మేడే జరుపుకుంటున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది మేడేతో దేశంలో మేడే జరుపుకొని 100 ఏళ్లు పూర్తయ్యిందని గుర్తు చేశారు. 1923లో అప్పటి మద్రాస్ నగరంలో మే 1న కామ్రేడ్ ఎం.సింగరవేలు ఎర్ర జెండా ఎగరవేశారన్నారు. ప్రపంచంలో ఉద్యోగాలు, వేతనం, పని చేసే చోట భద్రత కోసం ఎన్నో పోరాటాలు నేటికీ జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్మికవర్గం స్థానికుల మద్దతుతో సంఘటితంగా పోరాటాలు చేస్తూ పెట్టుబడిదారుల ఆటలు సాగనివ్వలేదన్నారు.

మోదీ ప్రభుత్వం భారం మోపుతోంది..

మోదీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందని అన్నారు. కార్మికులను మతం ప్రకారం విడగొట్టడమే లక్ష్యంగా ఉపాధి సంబంధాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. పని ప్రదేశంలో ఎలాంటి హక్కులూ లేకుండా బానిసలుగా మారుస్తోందన్నారు. ఇదేక్రమంలో ఇప్పుడున్న చట్టాలను నిర్వీర్యం చేసే పనిలో ఉందన్నారు. లేబర్ కోడ్‌ల మార్పు ఇప్పటికే ప్రారంభమైందన్నారు. మేడే రోజున దృఢ సంకల్పంతో కార్మికవర్గం పోరాటం కొనసాగించేందుకు దీక్షబూనాలని రాంభూపాల్ పిలుపునిచ్చారు.

దిశ, సీసీఎస్ డీఎస్పీలు రిలీవ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం దిశ, సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు, మహబూబ్‌బాషా రిలీవ్ అయ్యారు. తాజా బదిలీల నేపథ్యంలో ఇద్దరూ ఆదివారం రాత్రి రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. విధినిర్వహణలో అధికారి చూపిన చొరవ, సిబ్బంది సంక్షేమంపై తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీసు శాఖలో ఉద్యోగం పొందడం వరమని తెలిపారు. ప్రజలకు సేవచేయాలన్న సంకల్పం ఉంటే ప్రతి ఒక్కరినీ ఉన్నత స్థానంలో ఉంచుతుందన్నారు. తనపై జిల్లా వాసులు, సిబ్బంది చూపిన ప్రేమాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

జానపద సాహితీ పిపాసి 'చిగిచర్ల'



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: జానపద కథలు, సాహిత్యంతో ఆకట్టుకున్న చిగిచర్ల కృష్ణారెడ్డి వంటి సాహితీ పిపాసులు అరుదుగా ఉంటారని వక్తలన్నారు. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి రచించిన తొమ్మిది పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోమ్‌లో జరిగింది. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ వీసీ కాడా రామకృష్ణారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న తదితరులు మాట్లాడారు. అనంతరం తొమ్మిది గ్రంథాలను సాహితీవేత్తలు డాక్టర్ హేమమాలిని, నాగేశ్వరాచారి, వెంకటేశ్వర ప్రసాద్ పరిచయం చేసి వాటి ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రాజారాం, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, తన్నీరు నాగేంద్ర, టీవీరెడ్డి, డాక్టర్ అనితమ్మ, నబీరసూల్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలి

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం


రాప్తాడురూరల్: పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారని, బాగా చదువుకొని తల్లిదండ్రులు గర్వించే స్థాయికి ఎదగాలని రాప్తాడు ఎమ్మెల్యే, లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల పూర్వ విద్యార్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం అనంతపురం ఆదిమూర్తినగర్‌లోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో విద్యా సంస్థల 44వ వార్షికోత్సవం జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తాను చదివానని తెలిపారు. అందరినీ బడికి పంపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. చదువుతోనే పేదరికాన్ని దూరం చేసి ఆర్థికాభివృద్ధి సాధించొచ్చన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులకు పెద్దపీట వేస్తోందన్నారు. ఎందాకైనా చదవండి అందుకయ్యే ఖర్చు జగనన్న భరిస్తారన్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమేష్‌నారాయణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ ఆంజనేయులుగౌడ్, ఏట శివారెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే తమ కుటుంబాలకు చాలా మేలు జరిగిందని ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఆదివారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వెళ్లి ప్రజల ప్రభుత్వంపై, ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకు వలంటీర్లు పథకాలు అందిస్తున్నారని ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

సంక్షిప్త సమాచారం

విలువలతో కూడిన విద్యను బోధించాలి



ట్రెల్లీస్ పాఠశాల విద్యార్థులతో మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రాప్తాడురూరల్: నేటితరం పిల్లలకు విలువలతో కూడిన విద్యను బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ది ట్రెల్లీస్ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం రాత్రి గుత్తిరోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ వడ్ల అధ్యక్షతన జరిగిన వేడుకలకు లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

3న రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు: అక్కమ్మ దేవతల పరుషను పురస్కరించుకొని ఈనెల 3న రాష్ట్రస్థాయి దేశపు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9701094040, 8919422008లో సంప్రదించాలన్నారు.

నేడు స్పందన

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని ఆదివారం కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలను స్పందనలో ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

వివాహిత బలవన్మరణం

రాప్తాడు రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం మండలం కొడిమి గ్రామానికి చెందిన నారాయణస్వామి, స్వర్ణ (26) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నారాయణస్వామి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల స్వర్ణకు అబార్షన్ కావడంతో అనారోగ్యానికి గురైంది. ఈ క్రమంలో వైఎస్సార్ జిల్లా కమలాపురంలో నివాసముంటున్న తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు సతమతమవుతుంటే వారిని ఆదుకోలేకపోతున్నాననే ఆవేదన ఆమెను మరింత కలచివేసింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బార్‌లో దొంగలు పడ్డారు



క్యాష్ కౌంటర్ వద్ద తచ్చాడుతున్న దొంగ (సీసీ ఫుటేజీ)



ఘటనపై ఆరా తీస్తున్న వన్‌టౌన్ ఎస్‌ఐ గౌస్, సీసీఎస్ సిబ్బంది

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సింధూర బార్‌లో దొంగలు పడ్డారు. ఆదివారం ఉదయం బార్‌కు చేరుకున్న యజమాని రామలింగారెడ్డి... తెరిచి ఉంచిన క్యాష్ బాక్స్‌ను గమనించి పరిశీలించాడు. అందులో ఉంచిన నగదు కనిపించకపోవడంతో సీసీఫుటేజీలను పరిశీలించి దొంగలు పడినట్లు గుర్తించి, వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ గౌస్, సీసీఎస్ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆదివారం వేకువజాము 2.30 గంటలకు బార్ వెనుకన ఉన్న గోడెక్కి ఆవరణలోకి దుండగుడు దిగినట్లు గుర్తించారు. అనంతరం వెనుకన ఉన్న తలుపునకు దిగువన కన్నం వేసి బార్ లోపలకు ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లో ఉంచిన రూ.2.70 లక్షలు అపహరించుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.